క్లుప్తంగా

10న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ హేమంత్ తెలిపారు. ఈ నెల 10న ఉదయం ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్ రెండో అంతస్తులో ఉన్న పీఎఫ్ కార్యాలయంలో అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక వారు అందించిన సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఇయల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

బాలానగర్: చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నానని మనస్తాపానికిలోనైన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దంతోజు వెంకటేశ్వర్లు, పద్మ దంపతులు బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారి రెండో కుమారుడు శివప్రసాద్ (19) బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బీటెక్ మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్‌లో ఫెయిలైన అతను తరచూ బాధపడుతుండేవాడు. శనివారం కుటుంబ సభ్యులు బయటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి శివప్రసాద్ గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబసభ్యులు తలుపులు కొట్టినా స్పందన లేకపోవడంతో కిటికీలోనుంచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాననే బాధతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి పద్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి



ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. 3వ రోజు ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి శనివారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్‌అమీర్, శాంతినగర్, సుమిత్రానగర్, చైతన్య నగర్, కమల ప్రసన్న నగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, మాధవరం కాలనీల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కాలనీల్లో పాదయాత్ర చేస్తూ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని ఎక్కడికక్కడ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, మంచినీరు, రోడ్లు, వీధి దీపాలు, ఎలక్ట్రికల్ సంబంధిత సమస్యలను కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఇప్పటికే వివేకానందనగర్‌లో 85 శాతం పనులు పూర్తయ్యాయని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి కాలనీలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరరావు, బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


హైదర్‌నగర్‌లో పర్యటిస్తున్న గజ్జల యోగానంద్

భాగ్యనగర్‌కాలనీ: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాడుతుందని పార్టీ సీనియర్ నాయకులు గజ్జల యోగానంద్ అన్నారు. శనివారం ఆయన సమస్యలు తెలుసుకునేందుకు హైదర్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. శ్రీనివాసకాలనీ, లేక్ వ్యూ కాలనీ, గౌతమి నగర్, శుభోదయం కాలనీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాదయాత్ర చేస్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో హుడాపార్కు, ప్రగతినగర్‌లోని చెరువుల కబ్జాలు, ట్రాఫిక్ సమస్య, వృద్ధులకు పెన్షన్, రేషన్ కార్డులు, డ్రైనేజీ, నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రజలను మోసం చేసి ముఖ్యమంత్రి మాత్రం ప్రగతి భవన్‌లో ఉంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మ్యాన్‌హోల్స్ రోడ్డు స్థాయికి సమానంగా లేని కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతన్నారన్నారు. స్థానిక హుడా పార్కును కబ్జా చేయడానికి కార్పొరేటర్, ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, వెలగా శ్రీనివాస్, కృష్ణంరాజు, శేషయ్య, సైదులు, కోటేశ్వరరావు, బాలాజీ, కృష్ణ, వెంకట్, బాలకృష్ణ, పృథ్వీ, బ్రహ్మయ్య, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భాగ్యనగర్‌కాలనీ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 40–45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఓ షెడ్డు వద్ద పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కూకట్‌పల్లి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అతని శరీరంపై ఎటువంటి గాయాలు లేవు. అతడి వివరాల కోసం పరిసరాల్లో విచారించినా ఎటువంటి సమాచారం లభించకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

శ్మశాన వాటిక పనులు వేగవంతం


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రామారావునగర్‌లోని శ్మశానవాటిక పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తున్నామని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. శనివారం స్థానిక గ్రేవ్‌యార్డ్‌ను సందర్శించిన ఆమె పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని శానిటేషన్ సిబ్బందితో శుభ్రం చేయించారు. శ్మశానవాటికలో వైకుంఠ కమాన్ నిర్మాణం పూర్తయ్యిందని, టైల్స్ పనులు జరుగుతున్నాయన్నారు, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు.కార్యక్రమంలో నాగుల సత్యం, రామిరెడ్డి, మోయాజ్, ఇస్మాయిల్, నూర్, యోగిరాజు, మహమ్మద్ బాయ్, కాజుబాయ్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'సేవ్ ఎర్త్' శోభాయాత్ర


ర్యాలీని ప్రారంభిస్తున్న మాధవరం కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: శ్రీ సరస్వతీ విద్యాపీఠం స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం కేపీహెచ్‌బీ కాలనీ శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఆధ్వర్యంలో 'సేవ్ ఎర్త్' నినాదంతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ యాత్ర రోడ్ నెంబర్ వన్ నుంచి బ్రాండ్ ఫ్యాక్టరీ, రమ్యాగ్రౌండ్, టెంపుల్ బస్ స్టాప్ నుంచి తిరిగి ధనలక్ష్మీ సెంటర్ మీదుగా స్కూల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా భూమిని కాపాడండి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడండి, ప్రతి ఒక్కరు మొక్కలు నాటండి, ప్రకృతికి సహాయపడండి అంటూ విద్యార్థినీ, విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు చింత రాజేశ్వరరావు, కార్యదర్శి ఈదర నాగేశ్వరరావు, కోశాధికారి నీలిమ, ప్రబంధకారిణి అధ్యక్షుడు చింత వైకుంఠం, కమిటి జాయింట్ సెక్రటరీ బివిఆర్. మూర్తి, హరిబాబు, కట్టా నరసింగరావు, రేవతి, ప్రధానోపాధ్యాయులు యం.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు

నేడు 'వైద్య నేస్తం' మెడికల్ క్యాంప్

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని సుందరయ్య భవనంలో ఆదివారం 24వ వైద్య నేస్తం మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో బీపీ, షుగర్‌తో పాటు ఇతర సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. డాక్టర్లు సూచించిన మందులను రూ.100కే అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

17న 'శ్రీ సాయి అలేఖ్య' సాంస్కృతిక పురస్కారాల ప్రదానం

ఆల్విన్‌కాలనీ: శ్రీసాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీవిజన్ వీవీకే హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఉగాది పండుగను పురస్కరించుకుని బాల పురస్కారాలు, ఉపాధ్యాయ గురు ప్రతిభ పురస్కారాలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చాకలి ఐలమ్మ స్త్రీ శక్తి పురస్కారాలు అందజేయనున్నట్లు సంస్థ నిర్వాహకురాలు అరుణ ఉపద్రష్ట ఓ ప్రకటనలో తెలిపారు. 17న సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమంలో విద్య, వైద్య, సినీ, వ్యవసాయ, న్యాయ, క్రీడలు, నాట్యం, సంగీతం, సాహిత్యం తదితర రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు అవార్డులు అందజేయడంతో పాటు, నాట్యం, సంగీతం, చిత్రలేఖనం, ఏకపాత్రాభినయం, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బాలరత్న పురస్కారాలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9866739229 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘరానా దొంగ అరెస్ట్


నిందితుడు వెంకట్‌రావు


వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో శనివారం బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన రాయపాటి వెంకట్‌రావు వృత్తి రీత్యా వ్యవసాయదారుడు. చెడు వ్యసనాలకు బానిసైన అతను సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీల బాట పట్టాడు. తరచూ హైదరాబాద్‌కు వచ్చి తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడేవాడు. 2011లో పంజాగుట్ట పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లి వచ్చాడు. 2021లో జైలు నుంచి విడుదలైన అతను కొంతకాలం కొబ్బరిబోండాల వ్యాపారం చేశాడు. అయితే సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో మళ్లీ చోరీలు మొదలు పెట్టాడు. కూకట్‌పల్లి, చైతన్యపురి, ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. శనివారం ఉషాముళ్లపూడి కమాన్ వద్ద బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించిన వెంకట్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి బ్యాగ్‌ను సోదా చేయగా 24 గ్రాముల బంగారు ఆభరణాలు, 45 గ్రాముల వెండి వస్తువులు, రూ.14 వేల నగదు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ల్యాప్‌టాప్‌ల దొంగ దొరికాడు

50 ల్యాప్‌టాప్‌లు, 5సెల్‌ఫోన్లు, ట్యాబ్, ఐ ప్యాడ్ స్వాధీనం..


స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు

కేపీహెచ్‌బీకాలనీ: ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్న ఘరానా దొంగను కేపీహెచ్‌బీ, మాదాపూర్ సీసీఎస్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా, పండువ్వ గ్రామానికి చెందిన మామిడిశెట్టి సత్య అన్వేష్ రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్‌లు ఫుట్‌పాత్‌లపై నివాసం ఉంటాడు. జల్సాలకు అలవాటుపడిన అతను సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాట పట్టాడు. తాళం వేయని ఇళ్లు, బ్యాచిలర్ గదులు, హాస్టళ్లు, పార్కింగ్ చేసి కార్లలో ఉండే ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లేవాడు. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, మియాపూర్, మొగల్బూరు తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో అతడిపై 33 కేసులు నమోదై ఉన్నాయి. శనివారం ఉదయం కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్స్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించాడు. అతడి నుంచి 50 ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్, ఆపిల్ ఐ పాడ్, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు సత్య అన్వేష్‌ను అరెస్టు చేసి 61 తులాల బంగారాన్ని రికవరీ చేశారు. గతంలో విజయవాడ, భీమవరం, వైజాగ్ ప్రాంతీల్లో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లివచ్చాడని అయినా పద్ధతి మార్చుకోకుండా చోరీలకు పాల్పడున్న సత్యాన్వేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని డీసీపీ తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్‌లు కిషన్‌కుమార్, ప్రసన్నకుమార్, నర్సింగ్‌రావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, వెటర్నరీ డాక్టర్ లింగస్వామి తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్, శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌యంసి వెటర్నరీ శాఖ, జీహెచ్‌యంసీ ఎంటమాలజి విభాగం సహకారంతో విద్యార్థులకు వీధి కుక్కల నుంచి రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారులు పాఠశాలకు వచ్చేటప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా కుక్క కాటుకు గురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలిపి వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు. వెటర్నరీ డాక్టర్ లింగస్వామి మాట్లాడుతూ డివిజన్‌లోని కుక్కలకు ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. వీధి కుక్కల వల్ల ఎటువంటి ఇబ్బంది ఎదురైనా 040–21111111 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు.కార్యక్రమంలో కుక్కకాటు నివారణ పద్ధతులు, వీధి కుక్కల పట్ల ప్రవర్తించాల్సిన తీరుపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, బీఆర్‌యస్ నాయకులు నరసింహులు, సిద్ధయ్య, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ పి. నాగజ్యోతి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు, ఎంటమాలజి సూపర్‌వైజర్ డి. నరసింహులు, ఎంటమాలజి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఆల్విన్‌కాలనీ: యల్లమ్మబండ పరిధిలోని జన్మభూమి కాలనీకి చెందిన నరసింహ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహ కుటుంబ సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి ఆయన పిల్లలకు చదువు విషయంలో సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, షౌకత్ అలీ, మున్నా, రహమాన్, షకీల్‌మున్నా తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

బాలానగర్: పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ (ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా బాలానగర్, దిల్‌కుష్‌నగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకురాలు విజయ మాట్లాడుతూ దేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజలు దివాలా తీశారన్నారు.

ముఖ్యంగా గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటున్నాయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన


కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శన

మోతీనగర్: వస్త్రాలంకరణతోనే అందం వస్తుందని కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వాహకుడు సంజయ్ జైన్, వినోద్ అన్నారు. మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. ఈ మేళాలో ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, కళంకారి చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. అందరినీ ఆకర్షించే పలు వస్త్రాలతో పాటు అనేక రకాల వస్తువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ మేళా ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.